andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.7, కనిష్ఠం 28.8



నిర్మల్
జిల్లా వార్తలు

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

ప్రతీ డిపోకు లక్ష వసూలు లక్ష్యం కావాలి


మాట్లాడుతున్న డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 18 : ఆర్టీసీ ఆదాయం పెంచేందుకు ప్రతీడిపో పరిధిలో రోజు లక్ష రూపాయలు వసూలు లక్ష్యం కావాలని ఎండీ సజ్జనార్ సూచించినట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. గురువారం డిపో చాలెంజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోస్టర్ విడుదల చేశారు. జెండా ఆవిష్కరించారు. అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఏఈ నవీన్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీలో వరుస ఆత్మహత్యలు



- ఈ విద్యాసంవత్సరంలో ఆరుగురు బలవన్మరణం
- బాసర ట్రిపుల్ ఐటీలో తరచూ ఇలాంటి ఘటనలు
- రెండు రోజుల పాటు అధికారుల హడావిడి
- తర్వాత మళ్లీ పరిస్థితి మొదటికే
- నెలల తరబడి పరిష్కారం కాని లోపాలు
- జిల్లా ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- ఆత్మహత్యల కట్టడికి చర్యలు శూన్యం


వద్ల దీపిక
14-06-2023


బుర్ర లిఖిత 15-6-2023


జాదవ్ బబ్లు 7-8-2023


ప్రవీన్ కుమార్ 26-11-2023

బాసర, ఏప్రిల్ 18 : బాసర ట్రిపుల్ ఐటీలో వరుస ఆత్మహత్యలు అందరిని కలవరపెడుతున్నాయి. సాంకేతిక విద్యను పేద విద్యార్థులకు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటైన ఈ విశ్వ విద్యాలయంలో పేద విద్యార్థుల కుటుంబాల్లో తీవ్ర శోకాన్ని మిగుల్చుతుంది. యూనివర్సిటీలో లోపాలు విద్యార్థుల పాలిట శాపాలుగా మారుతున్నాయి. అనేక సమస్యల మధ్య చదువు సాగించలేక అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. ఏ సంస్థలో ఎక్కడా జరగని విధంగా తరచుగా ఆత్మహత్య ఘటనలు ఇక్కడ చోటుచేసుకుంటున్నాయి. ఒకటి రెండు నెలలకు ఒకసారి విద్యార్థుల మరణాలతో క్యాంపస్ వార్తల్లోకెక్కి అప్రతిష్ట మూటగట్టుకుంటుంది. చదువుకొని ఆసరాగా ఉంటారనుకుంటున్న తరుణంలో బిడ్డలు మృత్యువాత పడడం వారి తల్లిదండ్రులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తుంది. యూనివర్సిటీలో సమస్యలు పట్టించుకునే నాథుడు లేడు. ఉన్న వీసీకి ఇంచార్జీ బాధ్యతలు కావడంతో ఆయన పూర్తి స్థాయిలో ఇక్కడ సమయం కేటాయించలేకపోతున్నారు. దీంతో విద్యా బోధనతో పాటు మౌలిక వసతుల్లో విద్యార్థులకు ఎదురవుతున్న కష్టాలు, విద్యార్థుల చదువులో వెనుకబాటు తనానికి కారణమవుతున్నాయి. ఇలా పరీక్షల్లో తప్పి ఒత్తిడికి గురై విద్యార్థులు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు.

ఘటన జరిగినప్పుడు హడావుడి .... మళ్లీ మొదటికే

ఇక్కడ యూనివర్సిటీలో విద్యార్థుల ఆత్మహత్య ఘటనలు జరిగినప్పుడు హడావుడి తర్వాత షరామామూలు అనే విమర్శలు వినిపిస్తున్నాయి. దురదృష్టవశాత్తు ఏదైనా ఘటన జరిగితే అధికారులు సమీక్షలు సమావేశాలు కమిటీలంటూ పెద్ద హడావుడి సృష్టి స్తున్నారు. ఇలా ఒకటి రెండు రోజుల తర్వాత మళ్లీ పరిస్థితి మొదటి వస్తుంది. విద్యార్థుల కష్టాలు అడిగేవారు ఉండడం లేదు. యూనివర్సిటీకి ఇంచార్జీ వీసీ ప్రధా న సమస్యగా మారింది. రెగ్యులర్ అధికారి నియమించకపోవడంతో ఇక్కడ విద్యా ర్థులు అన్ని రకాలుగా నష్టపోతున్నారు. ప్రస్తుతం ఉన్న వైస్ చాన్సలర్ ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ కావడంతో రాష్ట్ర స్థాయిలో కీలక బాధ్యతలు ఉండడంతో బాసరకు సమయాన్ని కేటాయించలేకపోతున్నారు. నెలకు ఒకటి, రెండు సార్లు తప్పా బాసరకు రావడం లేదు. అది కూడా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నప్పుడే అధికారులకు క్యాంపస్ గుర్తుకస్తుందనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వాలు మారిన బాసర ట్రిపుల్ ఐటీలో పరిస్థితి మాత్రం మారలేదు. బోధన సిబ్బందికి అదనపు బాధ్యతలు అప్పగించి పరిపాలనను ఉన్నతాధికారులు గాలికి వదిలేశారు. ఇటు విద్యా బోధనపై దృష్టి పెట్టకా మరో వైపు పరిపాలనను సాగించక ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవు తున్నారు. ఇలా విద్యార్థుల ఆత్మహత్యలకు లోతుగా విచారించి పరిష్కరించే అధికారులు కరువయ్యారు. అందువల్లే వరుస ఆత్మహత్య ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

ఈ విద్యాసంవత్సరంలో ఆత్మహత్య చేసుకున్న ఆరుగురు విద్యార్థులు

1. వద్ల దీపిక జూన్ 14, 2023,
2 బుర్ర లిఖిత జూన్ 15, 2023
3. జాదవ్ బబ్లు ఆగస్టు 7, 2023
4.ప్రవీన్ కుమార్ నవంబర్ 26, 2023
5. శిరీష ఫిబ్రవరి 22, 2023
6. అరవింద్ ఏప్రిల్ 15, 2024

హామీలు తప్ప.. ఆచరణ శూన్యం

ఆత్మహత్య ఘటనలు జరిగినప్పుడు సమీక్షలో పలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. గతంలో మానసిక పరీక్షలు నిర్వహించేందుకు ఒక యాప్‌ను డెవలప్ చేశామని ఆ యాప్ ద్వారా విద్యార్థుల మానసిక స్థితిని అంచనా వేసి కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ప్రస్తుత వీసీ ఎనిమిదినెలల క్రిందటే చెప్పారు. అదేవిధంగా విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు ప్రోత్సహిస్తామని అన్నారు. క్రీడలకు అవసరమైన క్రీడాసామాగ్రిని సమకూర్చడం లేదు. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకు గ్రూప్ మ్యూజికల్ డాన్స్ ఏర్పాటు చేస్తామన్నారు. నెల లు గడస్తున్నా అది జరగలేదు. ఇవన్నీ చేస్తున్నట్లు గత జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ మారిన ఇప్పటికి ఇక్కడ పరిస్థితుల్లో మాత్రం మార్పులేదు. ఫిర్యాదు పెట్టెలను ఏర్పాటు చేసి విద్యా ర్థుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. బా క్సులు ఏర్పాటు చేశారు కాని సమస్యలు మాత్రం అలానే ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే అధికారుల హామీల చిట్టా చాటడంతా ఉంది.


అరవింద్ 15-4- 2024



చిన్న స్ప్రింగు.. నిలుపును పెద్ద ప్రాణం


యాంటీ సూసైడ్ ఫ్యాన్ రాడ్

వరుస ఆత్మహత్యలు చోటుచేసుకుంటున్న యూనివర్సిటీ అధికారులు మాత్రం కట్టడికి చర్యలు తీసుకోవడం లేదు. విద్యార్థుల ఆత్మహత్యలపై ఇతర చోట్ల తీసుకుంటున్న జాగ్రత్తలపై దృష్టి పెట్టడం లేదు. దేశంలో ఉన్నత విద్యకు కేంద్రంగా చెప్పుకునే రాజస్థాన్ కోటా జిల్లాలో కూడా ఆత్మ హత్య ఘటనలు తరచుగా జరిగేవి. అక్కడ కూడా అనేక ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికి అవి కొనసాగేవి. కాని కొన్ని రోజుల నుంచి అక్కడ తీసుకున్న ప్రభుత్వ అధికారుల చర్యలు ఆత్మహత్యలను కొంత వరకు కట్టడి చేస్తున్నారు. అందులో ప్రధానమైనదే సీలింగ్ ఫ్యాన్స్ స్ప్రింగ్ సిస్టమ్. ఎక్కడైనా సరే ఆత్మహత్య ఘటనలు ఎక్కువగా ఫ్యాన్ ఆధారంగా చేసుకుంటారు. ఇప్పుడు ట్రిపుల్ ఐటీలో జరిగిన ఆత్మహత్యలన్నీ ఫ్యాన్‌కు ఉరివేసుకున్నవే.

ఈ చిన్న పరికరం పనిచేసే విధానం ...

సీలింగ్ ఫ్యాన్ పై భాగంలో ఈ ప్రత్యేక స్ప్రింగును అమర్చుతారు. ఫ్యాన్ పనిచేయడానికి ఇది అనువుగా ఉంటుంది. 20 కిలోల కంటే ఎక్కువ బరువు ఉన్న వస్తువును ఫ్యాన్‌కు వేలాడదీస్తే అది స్ప్రింగు విస్తరిస్తుంది. ఈ పద్దతిలో ఎవరైనా ఆత్మహత్య చేసుకోవడం అసాధ్యం, ఫ్యాన్‌కు వేలాడడానికి ప్రయత్నిస్తే మెడకు బిగుసుకునే అవకాశం ఉండది. వెంటనే నేలకు తాకి నిలిచిపోతారు. ఇప్పుడు ప్రస్తుతం ఈ పరికరాన్ని రాజాస్థాన్ కోటాలోని ప్రతి కళాశాల, హాస్టల్‌లో ఈ స్ప్రింగు అత్యవసరం చేశారు. అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి స్ప్రింగులు లేని ఫ్యాన్‌లుంటే విద్యాసంస్థల లైసెన్సులను క్యాన్సల్ చేస్తున్నారు. వీటితో పాటు విద్యార్థుల మానసిక పరీక్షలు అక్కడి అధికారులు తరచుగా నిర్వహిస్తున్నారు. ఈ స్ప్రింగు పరికరాన్ని యాంటీ సూసైడ్ ఫ్యాన్ రాడ్ అని కూడా అంటారు. ఇది మార్కెట్‌లో ఒక్కటి రూ. 200 నుంచి 250 రూపాయలకు లభిస్తుంది. ఫ్యాన్ రాడ్ మాదిరిగానే ఉండే ఈ యాంటీ సూసైడ్ రాడ్ దాని స్థానంలో బిగించుకోవచ్చు.దీనికి అలారం సిస్టమ్ కూడా పెట్టుకోవచ్చు. ఎవరైనా సూసైడ్ చేసుకుంటే వెంటనే అలారం మోగుతుంది. దీనిపై కూడా యూనివర్సిటీ అధికారులు అధ్యాయనం చేసి యూనివర్సిటీలో ఉపగియోగించుకోవచ్చు.



వీర హనుమాన్ విజయ యాత్ర స్టిక్కర్స్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రేపు ఖానాపూర్‌లో శ్రీ వీర హనుమాన్ విజయయాత్ర

ఖానాపూర్, ఏప్రిల్ 18 : ఈ నెల 20వ తేదీన ఖానాపూర్‌లో బజరంగ్‌దళ్ ఖానాపూర్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర ర్యాలీ నిర్వహించనున్నట్లు బజరంగ్ దళ్ జిల్లా సంయోజక్ కాశవేణి ప్రణయ్‌కుమార్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా శ్రీ వీర హనుమాన్ విజయ యాత్ర పాటను, స్టిక్కర్స్‌ను ఆవిష్కరించారు. బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ భారీ ర్యాలీకి మండల నలుమూలల నుంచి హిందూ బంధువులు, బజరంగ్ దళ్ కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక హిందూ సంఘాల నాయకులు పడాల ప్రభాకర్, ఆసం ఉదయ్, ఎం. శ్రీను, జోగు లోకేష్, సంజయ్, భూమేష్, యోగి, శ్రీధర్, అఖిలేశ్వర్, రూపేష్, సాయి, విఘ్నేష్, నానిలతో పాటు పలువురు బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడు..

- వెలమ కులస్తులందరినీ దూషించడం తగదు
- పద్మనాయక వెలమ సంఘం నేత శ్రీధర్ రావు



నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 18 : రాష్ట్ర మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని జిల్లా వెలమ సంఘం మాజీ అధ్యక్షుడు వర్థినేని శ్రీధర్ రావు అన్నారు. గురువారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వెలమ సామాజిక వర్గాన్ని కించపరిచేలా మాట్లాడిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉండి ఒక కులాన్ని టార్గెట్‌గా చేసుకొని దూషించడం సమంజసం కాదన్నారు. ఎవరో ఒకరిద్దరు తప్పులు చేసినంత మాత్రాన వెలమ సామాజిక వర్గం మొత్తాన్ని జైలుకు పంపుతామంటూ మాట్లాడడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు.

వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్


లింబా (కే) గ్రామంలో మురికి కాలువలను పరిశీలిస్తున్న డీపీవో

కుంటాల, ఏప్రిల్, 18 : గ్రామాలలో మురికి కాలవలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ దోమలు వ్యాపించకుండా చూస్తూ వ్యాధులు ప్రబలకుండా చూడాలని కుంటాల మండల ప్రత్యేకాధికారి డీపీవో శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని లింబా (బీ), లింబా (కె) గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలో మురికి కాలువలు, చెత్త సేకరణ షెడ్డు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం తాగునీటి సరఫరా గురించి అధికారులు, గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఈయన వెంట ఎంపీడీవో రహీం, ఏపీవో నవీన్, పంచాయతీ సెక్రటరీలు తదితరులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

- నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం
- ఈ నెల 25 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ఉపసంహరణకు 29 గడువు
- మే 13న ఎన్నికలు : జూన్ 4న ఓట్ల లెక్కింపు
- వెల్లడించిన జిల్లా ఎన్నికల అధికారి ఆశిష్ సంగ్వాన్



వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల జిల్లా అధికారి


అధికారులను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 18 : పార్లమెంట్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విడుదల చేశారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో ఎన్నికల ప్రక్రియ వివరాలు ప్రకటించారు. గురువారం 18 నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభించినట్లు చెప్పారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరిస్తారని తెలిపారు. 26న పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు గడువు ఉందన్నారు. మే 13న ఎన్నిక ఉంటుందన్నారు. జూన్ 4న కౌంటింగ్ జరుపుతారన్నారు.

జిల్లాలో 925 పోలింగ్ కేంద్రాలు..7,36,642 మంది ఓటర్లు

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు 925 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖానాపూర్‌లో 308, నిర్మల్ 306, ముథోల్ 311 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 7,36,642 మంది ఓటర్లు కాగా పురుషులు 3,54,925, మహిళా ఓటర్లు 3,81,667 మంది ఉన్నారు. ఇతరులు 50 మంది ఉన్నారు.

పరిశీలకుల నియామకం

ఎన్నికల నిర్వహణకు 27 ఎఫ్ఎస్‌టీ, 27 ఎస్ఎస్‌టీ, 6 వీఎస్‌టీ, 3 వీవీటీ, 3 అకౌంటింగ్, 3 అసిస్టెంట్ ఎక్స్పెడించర్, 19 ఎంసీసీ, 7 ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వివిధ విభాగాలు పరిశీలించేందుకు 22 మంది నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ వివరించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

సారంగాపూర్, ఏప్రిల్ 18 : గ్రామీణ ప్రాంతాల్లో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మండల స్థాయి అధికారులతో పేర్కొన్నారు. గురువారం మండలంలోని చించోలి(బి)లో నర్సరీ, పల్లె ప్రకృతివనం, తాగునీటి బోరు బావులను పరిశీలించారు. ఆలూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామాల్లో నెలకొని ఉన్నటువంటి సమస్యలను వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలను జారీచేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని త్రాగునీటి సమస్యలపై దృష్టి సారించాలని అధికారులతో పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా ఉండడానికి ఇటీవలే చించోలి(బి)లె వేసినటువంటి బోర్ వెల్‌ను ఆయన పరిశీలించారు. త్రాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో అధికారులను అభినందించారు. ఈయన వెంట డీపీవో శ్రీనివాస్, ఎంపీవో తిరుపతి రెడ్డిలతో పాటు గ్రామస్థాయి అధికారులు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

- అల్లోల ప్రధాన అనుచరులు బీఆర్ఎస్‌కు రాజీనామా
- నేడు కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్‌లో చేరిక
- మండలంలో బిచాన ఎత్తేసిన బీఆర్ఎస్


కే. దేవేందర్‌రెడ్డి

దిలావర్‌పూర్, ఏప్రిల్ 18 : బీఆర్ఎస్‌కు బిగ్ షాక్ తగిలింది. రాష్ట్ర మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ప్రధాన అనుచరుడు, నిర్మల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొమ్ముల దేవేందర్ రెడ్డితో పాటు ఎంపీపీ పాల్దే అక్షర అనిల్, మాజీ ఎంపీపీ ఎలాల అమృత చిన్నారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోడె రాజేశ్వర్, సంభాజీ పటేల్, ఇప్ప నర్సారెడ్డి, మారుతి పటేల్, సప్పల రవి, దత్తు పటేల్, ధని రవితో పాటు పలువురు తాజా మాజీ సర్పంచ్‌లు, పీఏసీఎస్ డైరెక్టర్లు గురువారం బీఆర్ఎస్‌కు గుడ్ బై చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావు ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన అనంతరం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావుతో చర్చలు జరిపారు. మొదటి నుంచి అల్లోలతో నడిచిన వారంతా రాజీనామాలు చేయడంతో దిలావర్‌పూర్ మండలంలో బీఆర్ఎస్ బిచానా ఎత్తివేసినట్లుయింది.

నివురు గప్పిన నిప్పులా అసంతృప్తి

బీఆర్ఎస్‌లో నియంతృత్వ ధోరణి వల్ల తాము ఇంతకాలం ఎంతో మానసిక క్షోభను అనుభవించామని, అయినా అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో ఉన్న సన్నిహిత్యంతో ఇంతకాలం బీఆర్ఎస్‌ట కొనసాగామని వారు పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కార్యకర్తలకు మాట్లాడే స్వేచ్ఛ లేదని, నాయకులు చెప్పిందే కార్యకర్తలు బానిసలుగా వినాల్సి వచ్చిందన్నారు. కార్యకర్తలు ఆర్థికంగా నష్టపోయినా ఎవరు పట్టించుకోలేదన్నారు. ఎంతోకాలంగా మాలో ఉన్న ఆవేదన చెప్పుకునేందుకు ప్రయత్నించినా పట్టించుకునే నాథేడే లేదన్నారు. కాంగ్రెస్‌లో చేరిక సొంత ఇంటికి వచ్చామన్న భావన కలుగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పూర్వ వైభవానికి తామంతా కలిసికట్టుగా కృషి చేస్తామన్నారు.


గుండంపెల్లిలో బీఆర్ఎస్ నాయకులతో చర్చలు జరుపుతున్న శ్రీహరి రావు

సంక్షిప్త సమాచారం

పాలీసెట్ ప్రవేశపరీక్ష దరఖాస్తుకు 22 గడువు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 18 : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పాలీసెట్ 2024 పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 22 వరకు గడువు అని నిర్మల్ కళాశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. మే 24న పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. 10 పరీక్ష రాసిన విద్యార్థులు దరఖాస్తుకు అర్హులన్నారు. పాలీసెట్ వెబ్‌సైట్‌లో దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు. మెరిట్ ప్రకారం ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, డిప్లొమా కోర్సులలో ప్రవేశాలు కల్పించబడతాయన్నారు.

కార్పొరేట్ కళాశాల స్కీంకు దరఖాస్తు చేసుకోండి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 18 : కార్పొరేట్ కళాశాల స్కీం 2024-2025 సంవత్సరానికి ఎంపికకు గాను జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలు, రిప్యుటేడ్ కళాశాలలు ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వి. రాజేశ్వర్ గౌడ్ ఒక ప్రకటనలో కోరారు. ఎంపికైన కళాశాలలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగ, ఈబీసీ విద్యార్థులకు వివిధ పథకాలు కల్పిస్తారన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన డీసీసీ అధ్యక్షుడు

దిలావర్‌పూర్, ఏప్రిల్ 18 : మండలంలోని పలు బాధిత కుటుంబాలను డీసీసీ అధ్యక్షుడు కే. శ్రీహరి రావు గురువారం పరామర్శించారు. మాజీ ఎంపీపీ ఎలాల అమృత చిన్నారెడ్డి సోదరుడు నర్సారెడ్డి ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అలాగే బన్సపల్లి మాజీ సర్పంచ్ మేకల సునీత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ముత్యం రెడ్డి సతీమణి మృతి చెందారు. డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు ఆయా కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

దిలావర్‌పూర్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేందర్



దిలావర్‌పూర్, ఏప్రిల్18 : మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా కాల్వ గ్రామానికి చెందిన అంగూర్ మహేందర్‌ను నియమించి నట్లు డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు తెలిపారు. ఉపా . ధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కోడె విజయ్, లోలం గ్రామానికి చెందిన శ్రీహరి, ప్రధాన కార్యదర్శి నిమ్మ గణేష్‌లతో పాటు పది మందిని కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు శ్రీహరిరావు ప్రక టించారు.

మల్లయోధులను నిరాశపరిచిన కుస్తీ పోటీలు

భైంసా రూరల్, ఏప్రిల్ 18 : మండలంలోని కామోల్ గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని వీడీసీ ఆధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించే పోటీలు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీంతో పోటీలు నిరాశపరిచాయి. వీడీసీలకు, యువకులకు మధ్య సయోధ్య కుదరక పోవడంతో పోటీలు ఆగిపోయాయి.

క్షయ వ్యాధి వ్యాప్తిని అరికట్టండి : జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 18 : జిల్లాలో క్షయ పరీక్షలు పెంచి వ్యాధిని గుర్తించి వ్యాప్తి చెందకుండా చూడాలని నిర్మల్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి ధనరాజ్ సూచించారు. గురువారం వైద్యాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గర్భవతులను 12 వారాలలోపు నమోదు చేయాలన్నారు. వారికి సమయానుసారంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా వడదెబ్బ బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఓఆర్ ఎస్ ప్యాకెట్లు ఆశా కార్యకర్తలు, గ్రామ పంచాయతీలు, అంగన్‌వాడీల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ఉప వైద్యాధికారి రాజేందర్, డాక్టర్ ఇద్రీస్ గౌరీ, రవీందర్ రెడ్డి, రాజా రమేష్, తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ధనరాజ్



పొన్నారిలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం: ఎమ్మెల్యే

తాంసి, ఏప్రిల్18: కేంద్రంలో కాంగ్రెస్ పాలన వచ్చినప్పుడే సుస్థిరపాలన సాధ్యమవుతుందని ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి మండలంలోని పొన్నారి గ్రామంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణక్కతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి పాలన సుస్థిరంగా కొనసాగుతుందని అన్నారు. అదే రీతిలో కేంద్రంలో రాహుల్‌గాంధీ నాయకత్వాన పాలన వచ్చినట్లయితే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రతీఒక్కరు కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కౌడాల నారాయణ, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీ అభ్యర్థి సుగుణక్క, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాబురావు, గణేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశం ఇవ్వండి

● కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ

తాంసి, ఏప్రిల్18: కొంగుచాచి అడుగుతున్నా ఒక్కసారి అవకాశం ఇవ్వండి.. సచ్చేంత వరకు సేవ చేస్తూ ఉంటా.. అని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి పొన్నారి, హస్నాపూర్ గ్రామాలలో ఆమె ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందన్నారు. ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం తనవంతు సహకారం అందిస్తానన్నారు. తాను ఆస్తుల కోసమే.. కాంట్రాక్టర్ల కోసమో.. పోటీచేయడం లేదని ప్రజలకు సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో ముందుకు వచ్చానన్నారు. ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఆమె కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

గంజాయితో జీవితాలు నాశనం: ఎస్పీ

భీంపూర్/తలమడుగు, ఏప్రిల్18: గంజాయి జీవితాలను నాశనం చేస్తుందని, గంజాయిని సాగుచేయడం నేరమని ఎస్పీ గౌస్ అలం అన్నారు. గురువారం భీంపూర్ మండలకేంద్రంలోగల పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన పీఎస్ పరిసరాలను, రిసెప్షన్ సెంటర్‌ను, రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం గుంజాల గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని ప్రజలతో మాదక ద్రవ్యాలు, గంజాయి వాడకం, రవాణా, పండించడం లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. గంజాయి జీవితాలను నాశనం చేస్తుందని, గంజాయి సాగు చేస్తే ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు రావని వివరించారు. యువతకు చదువుపై ఆసక్తి కలిగేలా, ఉన్నత లక్ష్యాలను చేరుకునేలా కష్టపడాలని సూచించారు. అనంతరం గోవిందుపూర్ గ్రామంలో తిరిగి హనుమాన్ ఆలయ దర్శనాన్ని చేసుకున్నారు. ఈ గ్రామంలో గ్రామస్థులు గ్రామాన్ని వదిలి పోవడానికి గమనించిన ఎస్పీ గ్రామంలోని ఎక్కువశాతం ప్రజలు కిడ్నీ సమస్యతో బాధపడుతుండటంతో వారిని పలకరించి వారి వైద్య రిపోర్టులను పరిశీలించి, వైద్యులను సంప్రదించి దానికి గల కారణాలను తెలుసుకున్నారు. త్వరలోనే జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్ ఏర్పాటుచేసేలా కృషిచేస్తానని తెలిపారు. అలాగే మహారాష్ట్ర సరిహద్దుతో ఉన్న భీంపూర్ మండలం కరంజి, తలమడుగు మండలం లక్ష్మీపూర్, అంతర్రాష్ట చెక్‌పోస్టులను సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించారు. 24 గంటలు అప్రమత్తతతో ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. గంజాయి, మద్యం, డబ్బు, ప్రజలను ప్రలోభం చేసే విధంగా ఉండే బహుమతులను జిల్లాలోనికి రానివ్వకుండా పరిశీలించాలని సూచించారు. పరిశీలించే విధానాన్ని పూర్తిగా వీడియోగ్రఫీ నిర్వహిస్తూ ఉండాలని సూచించారు. చెక్‌పోస్టు నందు ఫారెస్ట్, రెవెన్యూ, ఎక్సైజ్, అధికారులతో సమన్వయాన్ని ఏర్పరచుకుని పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జైనథ్ సీఐ సాయినాథ్, భీంపూర్ ఎస్సై ప్రదీప్ కుమార్, తలమడుగు ఎస్సై ధనశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గోవింద్‌పూర్‌లో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ అలం

'సీఎం సభను విజయవంతం చేయండి'

ఇంద్రవెల్లి, ఏప్రిల్18: ఈనెల 22న ఆదిలాబాద్‌లో నిర్వహించే సీఎం సభను విజయవంతం చేయాలని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో నిర్వహించే ఈసభకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సోమోరే నాగోరావు, పట్టణ అధ్యక్షులు ఎం.డి.జహార్, నాయకులు ఎం.డి.మసూద్, మెస్రం నాగనాథ్, సూర్యవంశీ, గణేష్, పవార్ దుదరాం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం

ఉపాధి కూలీలకు సదుపాయాలు కల్పించాలి

● పనుల పరిశీలనలో డీఆర్డీవో పీడీ జి.సాయన్న



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న పీడీ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 18: ఉపాధి హామీ కూలీలకు పని చేసే చోట అన్ని సదుపాయాలు కల్పించాలని డీఆర్డీవో పీడీ జి.సాయన్న సూచించారు. మండలంలోని గౌరాపూర్ గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత దృష్ట్యా ఉపాధిహామీ పనులు చేసే చోట కూలీలకు వోఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయనవెంట ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు ఉన్నారు.

● గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చూడాలని డీఆర్డీవో పీజీ జి.సాయన్న అధికారులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, మిషన్ భగీరథ, గ్రామ పంచాయితీ ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. పైప్‌లైన్ లీకేజీలు లేకుండా చూడాలని, బోర్లను, బోర్‌బావుల మోటార్లు రిపేరు చేయించాలని, గ్రామంలో ఉన్న నీటివనరులను వాడుకలోకి తేవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కర్, ఏపీవో జాదవ్ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుకుమార్ పాల్గొన్నారు.



కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న పాయల్ శంకర్, ఎంపీ అభ్యర్థి గోడం నగేష్

బీఆర్ఎస్ మునిగిన నావ కాంగ్రెస్ మునిగిపోయే నావ

● ఎమ్మెల్యే పాయల్ శంకర్

గుడిహత్నూర్, ఏప్రిల్18: రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారుతున్నాయని, బీఆర్ఎస్ మునిగిన నావ అయితే కాంగ్రెస్ మునిగిపోయే నావ అని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్‌శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన పార్టీ చేరిక కార్యక్రమంలో బీఆర్ఎస్‌కు చెందిన మాజీ కౌన్సిలర్ శైలేందర్‌తోపాటు లింగాపూర్, మాన్కపూర్, శంభుగూడ, గుడిహత్నూర్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పాయల శంకర్, ఎంపీ అభ్యర్థి గోడవం నగేష్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక తెలంగాణ రాష్ట్రంలో భవిష్యత్తు అంత బీజేపీ పార్టీదేనని, రోజురోజుకు బీజేపీ పార్టీలో చేరికలు పెరగడమే ఇందుకు నిదర్శనమన్నారు. అనంతరం ఎంపీ అభ్యర్థి గోడం నగేష్ మాట్లాడుతూ తాను గతంలో మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఉన్నప్పుడు అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం గుడిహత్నూర్‌లో జరుగుతున్న అండర్‌పాస్ పనులు తాను ఎంపీగా ఉన్నప్పుడు మంజూరైన పనులని గుర్తుచేశారు. గతంలో గ్రామాలలో జరిగిన అభివృద్ధి పనులతోపాటు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ప్రతి సంక్షేమ పథకం కేంద్ర ప్రభుత్వ నిధులతో ముడిపడి ఉన్నవేనని తెలిపారు. కరోనా లాంటి విపత్తు సమయంలో దేశ ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నా మహనీయుడు నరేంద్ర మోదీ అని తెలిపారు. అంతటి మహోన్నతమైన వ్యక్తిని మరోసారి ప్రధాని చేయడమే లక్ష్యంగా కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి కృతజ్ఞత భావాన్ని తెలియపరచాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ కేంద్రే లక్ష్మణ్, పార్లమెంట్ కోకన్వీనర్ మయూర్ చంద్ర, బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉట్నూర్, ఏప్రిల్ 18: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక శాఖ అధికారి రాజలింగు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంకు, ఎల్‌పీజీ గోదాం వద్ద అగ్నిమాపక సిబ్బంది గురువారం ప్రదర్శనలు నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఉట్నూర్ ఫైర్‌స్టేషన్ అధికారులు సిబ్బంది ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాంల వద్ద అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నప్పుడు భయభ్రాంతులకు లోనుకాకుండా తమ వద్ద సిద్ధంగా ఉన్న కార్బన్ డయాక్సైడ్ సిలిండర్లను ఉపయోగించుకొని మంటలను ఆర్పాలన్నారు. కార్యక్రమంలో రమాకాంత్, వేణు, రవీందర్, అంజనేయులు, మాణిక్‌రావు, శ్యాంకుమార్‌లు పాల్గొన్నారు.

స్వగ్రామానికి చేరిన నవీన్ మృతదేహం

ఖానాపూర్, ఏప్రిల్ 18 : ఈ నెల 7వ తేదీన బెహ్రెన్ దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవీన్ మృతదేహం గురువారం తన స్వగ్రామమైన ఖానాపూర్‌కు చేరింది. మృతదేహం ఇంటికి చేరడానికి బెహ్రెన్ దేశంలో గల్ఫ్ అవగాహన వేదిక సభ్యులు రాజేశ్వర్, పెద్ద భూమన్న, డాక్టర్ భీమన్నలు తీవ్రంగా కృషి చేశారని గల్ఫ్ అవగాహన వేదిక రాష్ట్ర అధ్యక్షులు షబ్బీర్ పాషా తెలిపారు. గురువారం సుభాష్ నగర్ కాలనీలోని నవీన్ ఇంటి వద్ద శవపేటికపై ఎన్ఆర్ఐ పాలసీ జెండాను కప్పి నవీన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సహకారంతో గల్ఫ్ అవగాహన వేదిక ఆధ్వర్యంలో నవీన్ మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తీసుకువచ్చేందుకు కృషి చేశామన్నారు. బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వం దృష్టికి సైతం ఈ అంశాన్ని తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. మృతదేహం ఇంటికి చేరుకోవడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. నాలుగు రాళ్లు సంపాదించి కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న నవీన్ విగతజీవిగా తిరిగి రావడాన్ని ఆ కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు జీర్ణించుకోలేకపోయారు. మృతదేహం రాకతో సుభాష్‌నగర్ కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మున్సిపల్ చైర్మన్ సత్యం కుటుంబ సభ్యులను ఓదార్చి నవీన్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక నాయకులు లక్ష్మణ్, శంకర్, తిరుపతి, వెంకటి, అమీరుద్దీన్, సాజిద్, తదితరులున్నారు.

మంత్రి సీతక్క పేరిట వసూళ్ల దందా

● ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 : జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పేరిట సిర్పూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఆరోపించారు. గురువారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైస్‌మిల్లింగ్ పౌరసరఫరాలకు ఇవ్వగా సిర్పూరులో మాత్రం రైస్‌మిల్లింగ్ వ్యవస్థను ఎఫ్‌సీఐకి ఇవ్వటమేంటని ప్రశ్నించారు. ఈ విషయాన్ని తాము గతంలోనే ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. రైస్‌మిల్లర్లను బెదిరించి మళ్లీ అక్రమ వసూళ్లకు పాల్పడేందుకు ఈ చర్యకు పాల్పడినట్టు పేర్కొన్నారు. ఈ దందాలో కూడా మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, అల్లుడు రావి శ్రీనివాస్ హస్తం ఉన్నట్టు పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గానికి ఆర్‌డబ్ల్యూఎస్ నిధులు రూ.6కోట్లు మంజూరు కాగా కాంగ్రెస్ నాయకులకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లకు పనులు కేటాయించాలని రావి శ్రీనివాస్ సిఫార్సు చేయటం, మంత్రి వాటిపై సంతకం పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. స్థానికంగా ఉండే మహిళా వైద్యురాలిని భయాంభ్రాంతులకు గురిచేసి లక్షల్లో డబ్బులు డిమాండు చేయటం దారుణమన్నారు. అలాగే రియల్ ఎస్టేట్ సర్వేనెంబరు 146/2లోని వెంచర్ వేయగా, ఇందులో కూడా డబ్బులు వసూలు చేసినట్టు పేర్కొన్నారు. మంత్రి సీతక్క పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడిన వారిని వెంటనే విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, వీర భద్రాచారి, సిందం శ్రీనివాస్, కొప్పుల శంకర్, గోలేం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారి ఇంట్లో పోలీసుల విస్తృత తనిఖీలు

బెజ్జూరు, ఏప్రిల్ 18: అమాయక ప్రజలను ఆసరా చేసుకుని వడ్డీలు, చిట్టీల పేరుతో ప్రజలను పీడిస్తున్న వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అధిక వడ్డీల పేరుతో ప్రజలను ముక్కుపిండి వసూలు చేస్తున్న వారి ఆగడాలను అరికట్టేందుకు పోలీసులు కఠినచర్యలు తీసుకుంటున్నారు. గురువారం మండలం లోని మర్తిడి గ్రామానికి చెందిన చిలువేరు శ్రీనివాస్ అనే వ్యాపారి ఇంట్లో కౌటాల సీఐ సాదిక్‌పాషా ఆధ్వర్యంలో పోలీసులు సోదాలు చేపట్టారు.

ఆదిలాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్ గెలుస్తుంది

● డీసీసీ చీఫ్ శ్రీహరిరావు ● భారీగా కాంగ్రెస్‌లో చేరికలు

నిర్మల్ కల్చరల్, ఏప్రిల్ 18 : వచ్చే నెల జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ స్థానం కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలుపు ఖాయమని డీసీసీ చీఫ్ కే. శ్రీహరిరావు ధీమా వ్యక్తం చేశారు. గురువారం సోన్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులను కాంగ్రెస్ పార్టీలోకి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం ఏర్పాటు కావడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో నిర్మల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవ్వడం ఖాయమన్నారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వెల్మల్ బొప్పారం గ్రామ పార్టీ అధ్యక్షుడు బండారి నర్సయ్య, వార్డు సభ్యులు తలారి ప్రభాకర్. జక్క మోహన్, సాయన్న, సిద్దన్న వంద మందితో కలిసి పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజ్ నర్సింహా రెడ్డి, మోహినుద్దీన్, రమేష్ రెడ్డి, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీహరిరావు

భారీ ఆధిక్యతే లక్ష్యంగా ముందుకు సాగాలి

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్



పార్టీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, ఏప్రిల్ 18 : లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెడం నగేష్‌కు భారీ ఆధిక్యతను అందించి గెలిపించే లక్ష్యంతో నియోజకవర్గ బీజేపీ శ్రేణులు ముందుకు సాగాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పిలుపునిచ్చారు. గురువారం పట్టణ పరిధిలోని గణేష్‌నగర్ కాలనీకు చెందిన వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత లోక్‌సభ, గడిచిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల కంటే ఈ దఫా ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి మెజార్టీ అధికంగా ఉండాలన్నారు. ఇందుకోసం గాను పార్టీ ప్రతినిధులు కార్యోన్ముఖులై ప్రచార పర్వాన్ని చేపట్టాలన్నారు. బూత్‌స్థాయి నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వాన్ని నిర్వహించాలన్నారు. ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ప్రధాని మోదీ నేతృత్వంలో గడిచిన దశాబ్ద కాలంగా జరిగిన ప్రగతి, సంక్షేమం, సంస్కరణలు, విజయాలను ఇంటింటికి, గడప గడపకు వెళ్లి వివరించాలన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి ముథోల్ ఎమ్మెల్యే రామరావ్ పాటిల్ కండువా వేసి బీజేపీలోకి ఆహ్వానించారు.



అగ్ని ప్రమాద నివారణ చర్యలపై పెట్రోల్ బంక్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్నిప్రమాద నివారణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలి

● భైంసా ఫైర్ ఆఫీసర్ సింగన్న

భైంసా, ఏప్రిల్ 18 : పెట్రోల్‌బంక్. గ్యాస్ ఏజెన్సీ, జిన్నింగ్ ఫ్యాక్టరీల నిర్వహణ సిబ్బంది అగ్ని ప్రమాద నివారణ చర్యలపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకోవాలని భైంసా ఫైర్ ఆఫీసర్ సింగన్న పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణ పరిధిలోని వివిధ పెట్రోల్ బంక్‌లు, గ్యాస్ ఏజెన్సీలు, జిన్నింగ్ ఫ్యాక్టరీలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. అన్ని వేళల జాగ్రత్త చర్యలు పాటిస్తూ అప్రమత్తతతో వ్యవహరిస్తే అగ్ని ప్రమాదాలకు అవకాశముండదన్నారు అగ్నిమాపక శాఖ నిబంధనలకు అనుగుణంగా ప్రమాదాల నివారణకు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత సంస్థలలో ప్రమాదాలు జరగడానికి గల కారణాలు,వాటి నివారణ చర్యలు, పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై నిర్వాహణ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో అనుసరించాల్సిన విధానాలను వివరించారు. ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాలు, నివారణ చర్యలు, పాటించాల్సిన ముందు జాగ్రత్త చర్యలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

సహాయక పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు

● ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఏర్పాటు చేసిన సహాయక పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి సిర్పూర్, ఆసిఫాబాద్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలోని తహసీల్దార్‌లు, ఎన్నికల అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో భాగంగా ఆదిలాబాద్(001) నియోజకవర్గపరిధిలోని జిల్లాలోని సిర్పూర్(001), ఆసిఫాబాద్(005)శాసనసభ నియోజకవర్గ పరిధిలో మే13న జరుగనున్న పోలింగ్‌ప్రక్రియలో భాగంగా పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు, మూత్రశాలలు, నీడ తదితర సౌకర్యాల కల్పనతో పాటు వయోవృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులకు ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాపై పోలింగ్ కేంద్రం వివరాలు చిరునామా సరి చూసుకోవాలని ఏవైనా తప్పులు ఉంటే వెంటనే సరి చేయాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రత దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ విధులలో ఉన్న సిబ్బందికి అన్ని మౌలిక వసతులు కల్పించాలన్నారు. మహిళాసిబ్బంది, దివ్యాంగ ఓటర్లకు ప్రత్యేకఏర్పాట్లు చేయాలని తెలిపారు. తహసీల్దార్లు తమపరిధిలోని ప్రతిపోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పూర్తివివరాలతో నివేదిక సమర్పించాలన్నారు. సెక్టార్ అధికారులు, బూత్‌స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లతో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా కృషిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లారెవెన్యూ అధికారి లోకేశ్వర్‌రావు, కాగజ్‌నగర్ ఆర్డీవోసురేష్, తహసీల్దార్ ఎన్నికల విభాగం అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలి


పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నామినేషన్ స్వీకరణను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. ఆదిలాబాద్(001) పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని జిల్లాలోని సిర్పూర్ (001), ఆసిఫాబాద్(005) అసెంబ్లీ నియోజక వర్గాలలో ఎన్నికల నిర్వహణకు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 25వరకు (ప్రభుత్వ సెలవు రోజులు మినహాయించి) ప్రతి రోజు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఆదిలాబాద్‌లోని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్, సహాయరిటర్నింగ్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి ఆదిలాబాద్‌కు రాజకీయపార్టీలు, అభ్యర్థులు తమ నామినేషన్ సమర్పించ వచ్చన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 42.8 ၊ కనిష్ఠం 28.2

ఆదిలాబాద్

జిల్లా వార్తలు

5

శుక్రవారం 19 ఏప్రిల్ 2024

ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలి

నేరడిగొండ, ఏప్రిల్ 18: పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుహక్కు కలిగిన ప్రతీ ఒక్కరు తమ ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ బూస మహేశ్ కోరారు. గురువారం మండల కేంద్రంలో వాహనం ద్వారా కూడలిల వద్ద ఓటు ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఆయా కూడళ్ల వద్ద ఓటు హక్కును వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగోరావు, సీనియర్ అసిస్టెంట్ మీరాబాయి, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

- తొలిరోజు రెండు నామినేషన్ల దాఖలు
- ఆధార్ పార్టీ అభ్యర్థిగా మాలోత్ శ్యామ్‌లాల్ నాయక్
- బీజేపీ రెబల్స్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన రాథోడ్ సుభాష్
- నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్న ప్రధానపార్టీల అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్లకు అగ్రనేతల హాజరుకు ఏర్పాట్లు
- మొదలైన లోక్‌సభ ఎన్నికల కోలాహలం

నామినేషన్ల పర్వం షురూ



● నామినేషన్ దాఖలు చేస్తున్న ఆధార్ పార్టీ అభ్యర్థి





● ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు

ఆదిలాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల తొలిఘట్టమైన నామినేషన్ల స్వీకరణ మొదలైంది. గురువారం ఉదయం 11 గంటలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదలచేసిన అధికారులు ఆ వెనువెంటనే మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను చేపట్టారు. తొలిరోజురెండు నామినేషన్లు దాఖలయ్యాయి. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లమధ్య ఆదిలాబాద్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణను ప్రారంభించారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయ ఆవరణలో పటిష్టమైన నిఘా, భద్రతను ఏర్పాటుచేశారు. అభ్యర్థుల నుంచి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజార్షిషా నామినేషన్ పత్రాలను స్వీకరించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా పోలీసులు అవసరమైన ఏర్పాట్లను చేశారు. 100 మీటర్ల దూరంలోనే ర్యాలీలు, నేతల పర్యటనలు నిలిపివేసి నామినేషన్ వేసే అభ్యర్థి తోపాటు మరో నలుగురు వ్యక్తులను మాత్రమే లోనికి అనుమతించారు. ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానమైన ఆదిలాబాద్ లోక్‌సభస్థానం నుంచి ప్రధాన పార్టీలతోపాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈనెల 25వరకు నామినేషన్ల దాఖలుకు గడువు ఉండడంతో చివరిమూడు రోజుల్లోనే ఎక్కువగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశం కన్పిస్తోంది. మొత్తానికి లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల కోలాహలం మొదలుకావడంతో పల్లెలు, పట్టణాల్లో రాజకీయ సందడి నెలకొంటుంది. ప్రధానపార్టీల అభ్యర్థులు ప్రచారంతో హోరెత్తిస్తున్నా రు. అయితే ఏ పార్టీ అభ్యర్థికి గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్న టాక్ మొదలైంది.

బీజేపీకి రెబల్స్ గుబులు

సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావు బీజేపీ రెబల్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే లోక్‌సభ ఎన్నికల బరిలో ఉంటానని ఎంపీ సోయం బాపురావు ప్రకటించడం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈనెల 23 వరకు పార్టీ అధిష్ఠానం తన డిమాండ్లను పరిష్కరించకుంటే రెబల్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సోయం సిద్ధమవుతున్నారు. ఆయన ఈనెల 24, 25న నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి కారణం చెప్పకుండానే పార్టీపక్కన పెట్టడంపై సిట్టింగ్ ఎంపీ తీవ్ర అసంతృప్తితో కన్పిస్తున్నారు. పార్టీ అభ్యర్థిని ప్రకటించినప్పటి నుంచి పార్టీ కార్యక్రమాలకు, అభ్యర్థి ప్రచారానికి దూరంగానే ఉంటూ వస్తున్నారు. ఎలాగైనా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయాలన్న నిర్ణయంతో సోయం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇచ్చోడ మండలానికి చెందిన బీజేపీ నేత రాథోడ్ సుభాష్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆయన బీజేపీ రెబల్‌గా ఎన్నికల బరిలో దిగుతున్నట్లు పేర్కొన్నాడు. వీరిద్దరి బాటలో మరికొంతమంది నేతలు బీజేపీ రెబల్స్‌గా బరిలో దిగే అవకాశం కన్పిస్తోంది. ఇదే జరిగితే బీజేపీ గెలుపోటములపై ప్రభావం చూపనుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● నామినేషన్‌లకు అగ్రనేతల రాక

ప్రధానపార్టీల అభ్యర్థుల నామినేషన్లకు ఆ పార్టీల అగ్రనేతలు హాజరయ్యే అవకాశం కన్పిస్తోంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ నామినేషన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలుస్తోంది. అలాగే బీజేపీ అభ్యర్థి గోడంనగేష్ నామినేషన్ దాఖలుకు పలువురు కేంద్ర మంత్రులతోపాటు కిషన్‌రెడ్డి హాజరయ్యే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు నామినేషన్‌కు బీఆర్ఎస్ కీలకనేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, హరీశ్‌రావు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని పార్టీవర్గాల ద్వారా తెలుస్తోంది. 22న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆత్రం సుగుణ, 23, 24న బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కు, 24న బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆదివారం సెలవు కావడంతో నామినేషన్ల దాఖలుకు మరో ఆరు రోజుల సమ యం మాత్రమే మిగిలిఉంది. అగ్రనేతలు హాజరయ్యే అవకాశంఉండడంతో ఆయా పార్టీల నేతలు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన షెడ్యూల్ ఖరారైనట్లు తెలుస్తోంది.



అభ్యర్థి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు



నామినేషన్ దాఖలు చేస్తున్న స్వతంత్ర అభ్యర్థి సుభాష్

● తొలిరోజు ప్రశాంతం

నామినేషన్ల ప్రక్రియలో తొలిరోజు ప్రశాంతంగా ముగిసింది. నిబంధనల ప్రకారం నామినేషన్ వేసేందుకు అభ్యర్థులను అనుమతించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల దూరంలోనే వాహనాలను నిలిపివేసి అభ్యర్థితోపాటు మరో నలుగురికి నామినేషన్ వేసేందుకు అవకాశం కల్పించారు. తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు కాగా, ఆధార్ పార్టీ అ భ్యర్థిగా ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గంగాదేవిపాడ్ గ్రామానికి చెందిన మాలోత్‌శ్యామ్‌లాల్‌నాయక్ తన మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలుచేశారు. అలాగే ఇచ్చోడ మండలానికి చెందిన రాథోడ్‌సుభాష్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్‌ను వేశారు. టికెట్ ఆశించి భంగపడ్డ కొందరు సీనియర్ నేతలు నామినేషన్ వేసేందుకు తమఅనుచరులతో మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. తమ సామాజికవర్గం, కులసంఘాలు, ఉద్యోగ సంఘాల మద్దతుతో లోక్‌సభ ఎన్నికలబరిలో నిలిచేఅవకాశాలు లేకపోలేదు. 19, 21 తేదీల్లో స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్ దాఖలుచేసే అవకాశం కన్పిస్తోంది.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి పరామర్శ

నేరడిగొండ, ఏప్రిల్ 18: మండలంలోని చించోలి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్రం భాస్కర్ సోదరుడు ఆత్రం రవీందర్ ఇటీవల మృతి చెందగా విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి చించోలి వెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. రవీందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతిపట్ల ప్రగాఢ సానుభూతి తెలిపి కుటుంబ సభ్యులను ఓదార్చిధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. కార్యక్రమంలో వీరితో పాటు ఆత్రంసుశీల ఉన్నారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా రవి

బోథ్, ఏప్రిల్18: బోథ్ మండల కేంద్రానికి చెందిన సల్ల రవి పట్టణ అధ్యక్షునికి నియోజకవర్గ సేవాదళ్ నియోజకవర్గ ఇంచార్జిగా నియమించారు. ఈ మేకు నియామకపు పత్రాన్ని సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు జితేందర్ చేతుల మీదుగా అందుకున్నారు.

ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ నాయకుల ప్రచారం

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్18: పట్టణంలోని ఆయా కాలనీల్లో పట్టణ అధ్యక్షుడు నగేష్ ఆధ్వర్యంలో ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణ తరపున గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. క్రాంతినగర్‌లో ఇంటింటికీ తిరుగుతు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పూర్తి చేసిందన్నారు. పదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీజేపీ జిల్లాకు ఏమి చే యలేద న్నారు. ఈ సారికాంగ్రెస్ నుంచి పోటీచేస్తున్న ఆత్రంసుగుణను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జబిన్, ప్రేమల పాల్గొన్నారు.

'ప్రచారాన్ని ముమ్మరం చేయాలి'

నేరడిగొండ, ఏప్రిల్ 18: ఆదిలాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడంనగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అందుకు ప్రతి గ్రామంలో ముమ్మరంగా ప్రచారం చేయాలని బోథ్ అసెంబ్లీ కన్వీనర్ సూర్యకాంత్‌గిత్తే అన్నారు. గురువారం మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్ అధ్యక్షతనబీజేపీ మండల పార్టీ కార్యాలయంలో శక్తి కేంద్ర ఇన్‌చార్జీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మరో సారి నరేంద్రమోదీని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని, అందుకోసం ప్రతీ ఓటరును కలిసి ఓటును అభ్యర్థించాలన్నారు. ప్రతీ పోలింగ్ బూత్‌ను పటిష్ట పరచాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సాబ్లె సంతోష్‌సింగ్, ప్రధాన కార్యదర్శులు బంటు ప్రవీణ్, ధర్మపురి రాఘవులు, ఆకుల రాజశేఖర్, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు చొక్కపల్లి రాములు, గట్టునారాయణ, సాబ్లె కేవలంసింగ్, ఇందూర్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూర్యకాంత్‌గిత్తే

బీజేపీ, బీఆర్ఎస్‌లు ప్రజలకు చేసింది ఏమీలేదు

● గల్లీల్లో కాంగ్రెస్ వచ్చింది.. ఢిల్లీలోనూ కాంగ్రెస్ రావాలి: కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ

తలమడుగు, ఏప్రిల్ 18: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసింది ఏమీ లేదని, వారికి పదవులు తప్ప ప్రజల సమస్యలు పట్టవని కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో దేవాపూర్, బరంపూర్, ఝరిహూనగూడ, కుచ్లాపూర్ తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రచారంలో ఆమె మాట్లాడుతూ గత పదేళ్ల టీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పని చేసిన టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సొంత నియోజక వర్గానికి సొంత గ్రామానికి ఏమీ చేయలేదన్నారు. తనను గెలిపిస్తే జిల్లాకు కూడా ఏమి చేయడని ఎద్దెవ చేశారు. బీజేపీ అభ్యర్థి గతంలో టీఆర్ఎస్ పార్టీ నుంచి ఎంపీగా గెలిచిన కూడా జిల్లాకు ఏమి చేయలేదన్నారు. తనను పదవులు తప్ప ప్రజాసమస్యలు పట్టవన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఒకే ప్రభుత్వం ఉంటే సమస్యల పరిష్కారం తొందరగా సాగుతుందన్నారు. ఆదివాసీ మహిళగా కొంగు చాపి అడుగుతున్నానని, తనను ఎంపీగా గెలిపించాలని ఆమె కోరారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటుందన్నారు. పార్లమెంట్ అభ్యర్థిగా గెలిచిన వెంటనే ప్రతీ గిరిజన గ్రామాల్లో తాగు, సాగునీరు, గుసాడిషెడ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ బొథ్ద నియోజక వర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ తలమడుగు జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, శ్రీకాంత్ వెంకన్నయాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా నాయకురాలు కాటిపెల్లి సునితారెడ్డి, తుడందెబ్బ నాయకులు జ్ఞానేశ్వర్, ప్రకాష్‌రావు, వెంకన్నయాదవ్, ప్రతాప్, అనంతరం బరంపూర్ మాజీ ఎంపీటీసీ సునితా శాస్త్రీ, బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు.

12లోగా మరమ్మతులు పూర్తిచేయాలి

● పాఠశాలను సందర్శించిన ఎంపీడీవో, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ

నేరడిగొండ, ఏప్రిల్ 18: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మర మ్మతు పనులను జూన్ 12లోగా పూర్తి చేయాలని ఎంపీడీవో రాజ్‌వీర్, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ రమేష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలతోపాటు వడూర్, బొందిడి, సూర్ధాపూర్ గ్రామాల్లో గల పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా పాఠశాలల్లో ఎలాంటి సమస్యలు లేకుండా పనులు చేపట్టాలని ఆదేశించారు. నిధులు సైతం రూ.1లక్షకు రూ.25వేలు అడ్వాన్సు ముందుగా ఇవ్వడం జరుగుతుందని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. వీరి వెంట ఎంఈఓ భూమారెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులున్నారు.



పాఠశాలలోని మరుగుదొడ్డి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

సెగలు కక్కుతున్న భానుడు!

● జిల్లాలో అత్యధికంగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు ● చప్రాలలో 43.5 డిగ్రీల ఉష్ణోగ్రతలు ● ఎండలకు అల్లాడుతున్న మూగజీవాలు



జిల్లా కేంద్రంలో నిర్మానుష్యంగా మారిన రోడ్లు



ఎండతాపానికి నీటితొట్టెలో ఈదుతున్న శునకం

ఆదిలాబాద్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భానుడి భగభగలకు జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత రెండురోజుల నుంచి ఎండలు దంచికొట్టడంతో ఉష్ణోగ్రతలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. దీంతో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గురువారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 42.8 డిగ్రీలు కాగా కనిష్ఠంగా 29.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో అత్యధికంగా బేల మండలం చప్రాలలో 43.5 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు కాగా వరుసగా భీంపూర్ మండలం అర్లి (టి)లో 43.3, ఆదిలాబాద్‌రూరల్ మండలం పిప్పల్‌ధరిలో 43.2, జైనథ్‌లో 42.4, ఆదిలాబాద్ అర్బన్‌లో 42.2, సిరికొండలో 41.7, ఇంద్రవెల్లిలో 40.7 గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇచ్చోడ, బజార్‌హత్నూర్, బోథ్ మండలాల్లో 40డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జనం బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. పగలంతా భగభగమండే ఎండలు రాత్రి వేళల్లో తీవ్రమైన ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఇప్పటికే పలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తలెత్తడంతో ప్రజలు దాహం తీర్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఎండల తీవ్రతకు మూగజీవాలు కూడా అల్లాడుతున్నాయి.



శోభాయాత్రలో కళశాలతో మహిళలు

శోభాయమానంగా దుర్గామాత శోభాయాత్ర

ఆదిలాబాద్‌అర్బన్, ఏప్రిల్18: మావల మండల పరిధిలో గల గ్రీన్‌వ్యాలీ కాలనీలో నూతనంగా నిర్మించిన దుర్గామాత ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ కార్యక్రమాలు వైభవంగా ఆరంభమయ్యాయి. ప్రతిష్ఠాపనోత్సవాలకు గురువారం శోభాయాత్రలో అంకురార్పణ చేశారు. ఆలయ నిర్మాణకర్తలు రమేష్‌శర్మ, సంజయ్‌శర్మల నేతృత్వంలో పట్టణంలోని రాణిసతీజి ఆలయం ఆవరణలో వేదపండితుడు పణతుల ప్రవీణ్‌శర్మ నేతృత్వంలోని పండితబృందం దుర్గామాత ఉత్సవవిగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉత్సవవిగ్రహాన్ని ప్రతిష్ఠించి మంగళవాయిద్యాల నడుమ శోభాయాత్ర కొనసాగింది. సంప్రదాయ ఏకరూపదుస్తులు ధరించిన మహిళలు నెత్తినపూర్ణ కళశాలను ఎత్తుకొని శోభాయాత్ర వెంట నడిచారు. దేవినామస్మరణలు, మంగళ వాయిద్యాల హోరుతో వీధులు మారుమ్రోగాయి. నేటి నుంచి 21వ తేదీ వరకు నూతనఆలయంలో ప్రతిష్ఠాపన ఉత్సవాలు శోభాయమానంగా కొనసాగనున్నాయి.

'అమరవీరుల సంస్మరణను జయప్రదం చేయండి'

ఉట్నూర్, ఏప్రిల్18: భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన పోరాటంలో అసువులు బాసిన ఆదివాసీ అమరవీరుల 43వ సంస్మరణ దినం విజయవంతం చేయాలని ఆదివాసీ విద్యార్థిసంఘం జిల్లా అధ్యక్షుడు సిడాం జంగుదేవ్, జిల్లాప్రధాన కార్యదర్శి మంగం దీపక్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. శనివారం జరుగనున్న సంస్మరణ దినం పురస్కరించుకొని ఆదివాసీ విద్యార్థిసంఘం, తుడందెబ్బ ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వద్ద 20న ఉదయం 10గంటలకు అమరవీరుల యాదిలో ఆదివాసీ సంప్రదాయాలను పాటిస్తూ సంస్మరణను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంస్మరణ కార్యక్రమానికి ఆదివాసీసంఘాల రాష్ట్ర నాయకులు తుడందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టంఉపేందర్, తుడందెబ్బ కార్యదర్శి గంట, సత్యంలు హాజరవుతారని తెలిపారు. అమరవీరుల స్ఫూర్తితో ఆదివాసీ స్వయం పాలన సాధనకై నడుం భిగించాలని పిలుపునిచ్చారు.అదే విధంగా ఇంద్రవెల్లిలోని అమరుల స్థూప భూమిని కబ్జా చేయాలని చూసే వారికి తగిన బుద్ధి చెబుతామని, స్థూప భూమి పరిరక్షణ కోసం రానున్న కాలంలో ఆదివాసీలతో కలిసి పోరాటాలు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు. ఆదివాసీ అమరవీరుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఏప్రిల్ 20 ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణను విజయవంతం చేయాలని ఆదివాసీ సమాజానికి విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు.

మార్కెట్‌లో భారత్ బ్రాండ్ రైస్!

ఆదిలాబాద్ అర్బన్, ఏప్రిల్ 18: దేశంలో బియ్యం ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో దీంతో ధరలను కట్టడి చేయడానికి కేంద్ర ప్రభుత్వం తక్కువ ధరకే భారత్ బ్రాండ్ రైస్ పేరుతో బియ్యాన్ని విక్రయిస్తోంది. కిలో సన్నబియ్యం రూ.29కి అందించేందుకు కేంద్రం సిద్ధమైంది. ఫిబ్రవరిలో భారత్ రైస్‌ను దేశవ్యాప్తంగా ప్రారంభించారు. అయితే ఆదిలాబాద్ జిల్లాలో మూడురోజుల క్రితం ప్రారంభించారు. ఆధార్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి రూ.29 చొప్పున 10కిలోల బియ్యం బస్తాను రూ.290 అందిస్తున్నారు. మున్నూరు కాపు సంఘ భవనం వద్ద ప్రత్యేక దుకాణం ఏర్పాటు చేశారు. ప్రజలు కూడా పెద్దసంఖ్యలో వీటిని తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా డీలర్ జువ్వాజివార్ అనికేత్ మాట్లాడుతూ తక్కువ ధరలకు కేంద్ర ప్రభుత్వం నాణ్యమైన, పోషక గుణాలున్న భారత్ రైస్‌ను తక్కువ ధరకు అందిస్తోందన్నారు. ప్రస్తుతం బియ్యం మాత్రమే ఉందని, త్వరలో గోధుమ పిండి, శనగ పిండి, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులు అందుబాటులో రానున్నట్లు చెప్పారు. ప్రజలు తమ వెంట ఆధార్ కార్డు తీసుకువస్తే సరుకులను అందిస్తామని పేర్కొన్నారు.